క్లుప్తంగా

వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడిగా ఉసేన్‌సాహెబ్



ఉసేన్ సాహెబ్‌కు నియామక పత్రం అందిస్తున్న తహసీల్దార్ సుభద్రమ్మ

పాములపాడు: వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడిగా తుమ్మలూరు వీఆర్వో ఉసేన్‌సాహెబ్‌ను శనివారం తహసీల్దార్ సుభద్రమ్మ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో తనను నూతన మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమ్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, ఆర్ఐ ఖాజాబీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు విద్య ఎంతో అవసరం



సైకిళ్లతో విద్యార్థినులు

మహానంది: మంచి సమాజాన్ని నిర్మించడానికి ఆడపిల్లలకు చదువు ఎంతో అవసరమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. నంద్యాల ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాల విద్యార్థినులకు శనివారం సైకిళ్లు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆడపిల్లలను ప్రోత్సహించడానికి సైకిళ్లు పంపిణీ చేయడం సంతోషం అన్నారు. బ్యాంక్ హెచ్ఆర్ కేశవ మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా బాలికలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీర్‌బాషా, నీలం వెంకటేశ్వర్లు, సలీం పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతున్న పేదలు

జూపాడుబంగ్లా: ఇచ్చిన మాట మేరకు కూటమి ప్రభుత్వం ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని పోతులపాడు, చాబోలు, 80 బన్నూరు గ్రామాలకు చెందిన పలువురు పేదలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తమను కలిసిన సీపీఐ నాయకులతో పేదలు సమస్యలు విన్నవించుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల చొప్పున పేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని, ఇప్పుడు కాలయాపన చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రమేష్‌బాబు, మగ్బుల్ బాషా, నాగన్న, రమణ, శ్రీను, పుల్లయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ధోబీఘాట్ స్థలం పరిశీలన



ధోబీఘాట్ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రత్నరాధిక

ఆత్మకూరు: పట్టణ వాసుల సౌకర్యార్థం ధోబీ ఘాట్‌కు సంబంధించిన స్థలాన్ని శనివారం తహసీల్దార్ రత్నరాధిక పరిశీలించారు. ధోబీఘాట్ కమిటీ సభ్యులకు సరిహద్దులను చూపించి, కమిటీ వారు రాళ్లు నాటాలని సూచించారు. ఎవరైనా స్థలాన్ని ఆక్రమించుకునేందుకు యత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సమస్యలపై యువత పోరాడాలి



సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి యువత పోరు బాట పట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ సూచించారు. స్థానిక సుదర్శనవర్మ భవన్ వద్ద శనివారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. రణధీర్ మాట్లాడుతూ దక్షిణ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత సుందరయ్య సొంత గడ్డ మీద చారిత్రాత్మకమైన మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలందరూ సుఖంగా జీవించే సోషలిస్టు సమాజం కావాలని సుందరయ్య కలలు కన్నారన్నారు. ఇందుకోసం యువత పోరాడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, వీరన్న, భాస్కర్, మాబాషా, సామేలు, అంబయ్య, నూర్, నబి, కిరణ్, రఫీ, మల్లయ్య పాల్గొన్నారు.

పల్లెలకు దారేది?

- జాతీయ రహదారుల ఏర్పాటులో అధికారుల అలసత్వం
- గ్రామాలకు దారులు మూసేస్తుండటంతో తీవ్ర ఇబ్బందుల్లో ప్రజలు



ముష్టపల్లె రోడ్డులో అండర్ పాస్‌గా భ్రమిస్తున్న పీతుర్ వాగు బ్రిడ్జి

ఆత్మకూరు రూరల్: అభివృద్ధికి చిహ్నాలుగా ఉండాల్సిన జాతీయ రహదారులు పల్లె వాసుల రాకపోకలకు అడ్డంకిగా మారుతున్నాయి. గ్రామాల వద్ద దారి వదలకుండా నిర్మిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలు–గుంటూరు స్టేట్ హైవేను 340 సి జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేసి నిర్మాణ పనులు మొదలు పెట్టారు. కానీ కర్నూలు నుంచి ఆత్మకూరు వచ్చే లోపు చాలా చోట్ల ఈ రహదారిని లింక్ చేసి ఉండే గ్రామీణ రోడ్లకు దారి తెన్ను లేకుండా పోయింది. అందుకే రోజు ఈ మార్గంలో ఆయా గ్రామాల ప్రజలు రోడ్డెక్కి ఉద్యమిస్తున్నారు. ఆత్మకూరు పట్టణానికి బైపాస్‌గా 340 సి వెళ్తోంది. ఇలా వెళ్తున్నందున బైపాస్ ఆత్మకూరు – నంద్యాల ప్రధాన రహదారిని, ముష్టపల్లె పీఆర్ రోడ్డును దాటుకుంటూ పోవాల్సి వస్తోంది. అందువల్ల ఆత్మకూరు – నంద్యాల ప్రధాన రహదారిని అండర్ పాస్ చేస్తూ బ్రిడ్జి నిర్మాణమవుతోంది. కానీ ఇదే మార్గంలో ఉన్న ముష్ట పల్లె రోడ్డును విస్మరించారు. ఈ మార్గంలో ముష్టపల్లె, సిద్దపల్లె, డైరీ కొట్టాల, పెద్దనంతాపురం, కొంతమేర సిద్దాపురం గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి. ఈ ఐదు గ్రామాల్లో సుమారు పదివేల జనాభా ఉంటోంది. ఈ గ్రామాలలో ప్రాథమిక విద్య తప్ప ఉన్నత పాఠశాలలు లేనందున విద్యార్థులు ఈ మార్గం నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. ఏ చిన్న పనికైనా గ్రామస్తులు ఇదే మార్గం గుండా ఆత్మకూరు చేరుకోవాలి. కానీ ఈ రహదారిని జాతీయ రహదారి మూసి వేస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు అనివార్యంగా బై పాస్ రోడ్డులో ఉన్న సర్వీస్ రోడ్డు వెంట అటు గీతా హోటల్ వరకు వెళ్లి కాని ఇటు ఆత్మకూరు – నంద్యాల ప్రధాన రహదారి అండర్ పాస్ గుండా కానీ ప్రయాణించాల్సి వస్తోంది. ఇది కనీసం రెండు కిలోమీటరు దూరం ఎక్కువ పెంచుతోంది. అదీగాక స్కూళ్లకు వెళ్లే విద్యార్థినులు వారు ప్రయాణించే ఆటోల వంటి వాహనాలలో నిర్మానుష్య ప్రదేశాల గుండా వెళ్లాల్సి ఉండడంతో వారి భద్రత ప్రశ్నార్థకమవుతోంది. నిజానికి సరిగ్గా ముష్టపల్లె రోడ్డును 340సి జాతీయ రహదారి బైపాస్ రోడ్డు క్రాస్ చేస్తున్న ప్రదేశంలో ఒక కాంక్రీట్ నిర్మాణం జరుగుతోంది. అది చూసి ఆయా గ్రామాల ప్రజలు అది వారి దారి కోసం నిర్మిస్తున్న అండర్ పాస్ అనుకున్నారు. కానీ అదే మార్గంలో క్రాస్ అవుతున్న పీతుర్ వాగుపై నిర్మిస్తున్న చిన్న పాటి బ్రిడ్జి అని అర్థమయ్యే సరికి నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. పీతుర్ వాగు ఇంకొంచెం ముందుకే ప్రవహిస్తూ ఉన్నా ఎవరి ప్రయోజనం కోసమో మరి దాన్ని ముష్టపల్లె రోడ్డుపైకి తెచ్చి నిర్మిస్తున్నారు. ముష్టపల్లె దారిలో రాకపోకలకు కలిగే ఇబ్బందులను ఏకరువు పెడుతూ హైవే కాంట్రాక్టర్‌కు ప్రజలు విన్నవించుకున్నారు కూడా. హైవే కాంట్రాక్టర్ తెలుగుదేశం పార్టీకి చెందిన శాసనసభ్యుడు మాత్రమే గాక, ప్రభుత్వంలో కీలకమైన బంధువులు ఉన్న వ్యక్తి కావడంతో పనులు ఆపి ప్రజల విజ్ఞప్తులు పట్టించుకునే స్థితిలో లేరు. అధికారులే ఇందుకోసం పూనుకుని అటవీ ప్రాంత గ్రామాలైన ముష్టపల్లె, సిద్దపల్లె, వాటి మజరా గ్రామాలకు రహదారి వసతిని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఐదు ఊర్ల ప్రజలకు ఇబ్బంది



హైవే నిర్మిస్తూ ఆత్మకూరు నుంచి ముష్టపల్లె, సిద్దపల్లె, పెద్దనంతాపురం, డైరీ కొట్టాల, సిద్దాపురం గ్రామాలకు ఉన్న దారిని మూసేస్తున్నారు. సర్వీస్ రోడ్ల వెంట వెళ్లి తిరిగి రావాలంటే సుమారు 3 కిలోమీటర్ల దూరమవుతుంది. విద్యార్థినులు పెద్దగా మనుషులు తిరగని పొలాల వెంట పాఠశాలలకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పవు. **– శివ, ముష్టపల్లె**

పొలాలకు ఎలా వెళ్లాలో..



మా గ్రామస్తులకు పొలాలన్ని తూర్పు దిక్కునే ఉన్నాయి. నల్లకాల్వ రస్తా గుండా అటు వెళ్లాల్సి ఉంటుంది. హైవేకు అండర పాస్ నిర్మించక పోవడంతో ఎలా వెళ్లాలో తెలియడం లేదు. సర్వీస్ రోడ్లు ఉంటాయని చెబుతున్నా దాదాపు 2కిలోమీటర్లకు పైగా తిరిగి రావాల్సి వస్తోంది. **– నారాయణ, కరివేన**

పారుమంచాల రోడ్డుకు అదే గతి

తంగడంచ దాటిన తరువాత పారుమంచాలకు వెళ్లే గ్రామీణ రహదారి కూడా హైవే వల్ల మూసుకుపోతోంది. ఇక్కడ సర్వీస్ రోడ్డు కానీ, అండర్ పాస్ కానీ లేదు. ఈ మార్గం నంద్యాల వరకు కొనసాగుతూ వేలాది మంది ప్రజలకు రవాణా మార్గంగా ఉంది. అలాగే పాములపాడు వద్ద ఇస్కాల – చెలిమిల్లకు వెళ్లే దారిలో అండర్ పాస్ ఎత్తు తక్కువగా పెట్టారు. దీంతో గడ్డి ట్రాక్టర్‌లు, ఎత్తు లోడ్ లారీలకు ఇబ్బందిగా మారింది.

ఆరుగురు తాత్కాలిక ఉద్యోగుల తొలగింపు

- ఇష్టకామేశ్వరి దర్శన టికెట్ల దందాకు పాల్పడినట్లు నిర్ధారణ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వాయర్‌లో ఆరుగురు తాత్కాలిక ఉద్యోగులను తొగించినట్లు శ్రీశైలం రేంజ్ అధికారి పి.సుభాష్ శనివారం తెలిపారు. శ్రీశైలక్షేత్ర పరిధిలో దట్టమైన అటవీప్రాంతంలో ఉన్న ఇష్టకామేశ్వరి అమ్మవారి దర్శనార్థం రోజుకు వందలాది మంది భక్తులు వస్తుంటారు. అటవీశాఖ నిబంధనల ప్రకారం వన్యప్రాణుల సంరక్షణార్థం ప్రతిరోజు 120 మంది భక్తులను మాత్రమే అనుమతిస్తారు. ఆన్‌లైన్‌లో 16, కౌంటర్ వద్ద 104 టికెట్లు అందుబాటులో ఉంటాయి. దర్శన టికెట్లు పొందడం కోసం భక్తులు శిఖరేశ్వరం వద్ద ఉన్న టికెట్ కౌంటర్ క్యూలైన్‌లో అర్ధరాత్రి నుంచే వేచి ఉంటారు. భక్తుల అవసరాలను పసిగట్టిన తాత్కాలిక సిబ్బంది 12 మంది, భక్తులకు అందించే టికెట్‌లలో ప్రతిరోజు 25 నుంచి 30 టికెట్‌లు బ్లాక్‌లో ఉంచుకొని దందాకు తెరలేపారు. ఇష్టకామేశ్వరి మాతను దర్శించుకోవాలంటే ఒక్కో భక్తుడు ఒకరోజు ముందుగా కౌంటర్‌లో రూ.1,000 చెల్లించి, మరుసటిరోజు అటవీశాఖ వాహనాలలో వెళ్లి అమ్మవారిని దర్శించుకోవాలి. ఇదే అదునుగా తీసుకున్న ఉద్యోగులు ఒక్కో టికెట్‌ను రూ.2,000లకు బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు. ఈ విషయమై పలు ఫిర్యాదులు రావడంతో అటవీ అధికారులు 12 మంది ఉద్యోగులపై విచారణ జరపగా ఆరుగురు ఉద్యోగులు మాత్రమే టికెట్ల దందాకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో వారిని విధుల నుంచి తొలగించారు.

పాఠశాలల విలీన ప్రక్రియపై పునరాలోచించాలి



నిరసన తెలియజేస్తున్న ఆత్మకూరు డివిజన్ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు

ఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియపై పునరాలోచించాలని విద్యా పరిరక్షణ కమిటీ ఆత్మకూరు డివిజన్ కన్వీనర్ ఎం.షేక్ ఉమర్, ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కమతం శంకర్ కోరారు. పాఠశాలల విలీనాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక విద్య నిర్వీర్యానికి కారణమైన జీఓ 117ను రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. జీఓను రద్దు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఆదర్శ పాఠశాలల పేరుతో 2 కి.మీ. దూరంలో ఉన్న మరో పాఠశాలలో విలీనం చేయడానికి ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. ఆ ఆలోచనను విరమించుకుని ప్రతి కిలోమీటరుకు ఒక ప్రాథమిక పాఠశాల, ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7, 8 తరగతుల్లో 60 మంది విద్యార్థులు పైబడిన పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మార్చాలని, మిగిలిన ప్రాథమికోన్నత పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 16,347 ఉపాధ్యాయ పోస్టులను టెట్, ఎస్సీ వర్గీకరణను సాకుగా చూపించి నోటిఫికేషన్ విడుదలలో కాలయాపన చేయడం సరి కాదన్నారు. వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రామాంజనేయులు, అంబయ్య, రామమూర్తి, భాస్కర్, విదుభూషణ్, జక్కందాసు, రవికుమార్, రాంప్రసాద్, వహీద్, రాజానాయక్ పాల్గొన్నారు.

అండర్‌పాస్ వంతెన పనులు నిలిపేయండి

- ఎమ్మెల్యే జయ సూర్య



ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘాల నాయకులు

పాములపాడు: పాములపాడు–చెలిమిల్ల గ్రామాల మధ్య సమస్యాత్మకంగా మారిన అండర్‌పాస్ వంతెన నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపేయాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పీఎస్‌కే కంపెనీ యాజమాన్యానికి సూచించారు. శనివారం శనివారం ఆయన అండర్‌పాస్ వంతెన నిర్మాణాన్ని పరిశీలించారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వంతెన ఎత్తును పెంచాల్సిన అవసరం ఉందని రైతు సంఘాల నాయకులు, చెలిమిల్ల సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, లింగాల సర్పంచు మల్లీశ్వరరెడ్డి సమస్యను ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. రైతులు దిగుబడులను భారీ వాహనాల్లో తరలించాలన్నా, పశు గ్రాసం ట్రాక్టర్లు వెళ్లాలన్నా వంతెన ఎత్తు సరిపోదని ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే.. 4 రోజుల్లో జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరిద్దామన్నారు.

సర్వర్ సతాయింపు

- ఇబ్బందులు పడిన పింఛన్‌దారులు



పాత ముచ్చుమర్రి సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

పగిద్యాల: పింఛన్ల పంపిణీకి సర్వర్ సతాయించింది. దీంతో శనివారం మండల వ్యాప్తంగా చేపట్టిన సామాజిక పింఛన్‌ల పంపిణీలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. పింఛన్‌దారులు, అధికారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఉదయం 11 గంటల తర్వాత సర్వర్ సరిగా పనిచేయడంతో సాయంత్రంలోపు 90 శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సుమిత్రమ్మ తెలిపారు.

– **పాములపాడు:** మండలంలో 93.62 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మద్దూరు, క్రిష్ణానగర్ గ్రామాల్లో పింఛన్‌దారులకు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పింఛన్ సొమ్ము అందజేశారు.

- **కొత్తపల్లి:** మొదటి రోజు పింఛన్ల పంపిణీ 90.43 శాతం పూర్తయిందని ఎంపీడీఓ మేరి తెలిపారు.
- **మిడుతూరు:** మండల వ్యాప్తంగా 93 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ దశరథరామయ్య తెలిపారు.
- **నందికొట్కూరు:** సామాజిక పింఛన్లను మున్సిపల్ కమిషనర్ బేబి శనివారం పంపిణీ చేశారు. మొదటి రోజే 95.25 శాతం వరకు పూర్తి చేశామని, మిగతా వారికి ఒకటి, రెండు రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు.
- **జూపాడుబంగ్లా:** మండలంలో శనివారం సాయంత్రంలోపు 92.25 శాతం మంది పింఛన్‌దారులకు పింఛన్ సొమ్ము అందజేశామని ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు.

అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలి



రాష్ట్రపతికి లేఖలు రాస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

నందికొట్కూరు: అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ నాయకులు గోపాలకృష్ణ, ఫక్కీర్ సాహెబ్ కోరారు. శనివారం పట్టణంలోని ఐసీడీఎస్ అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ నాయకుల ఆధ్వర్యంలో లేఖలు రాశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలను, వర్కర్స్, ఆయాలను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. శిశు మరణాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషించేది అంగన్‌వాడీ వర్కర్లేనన్నారు. వర్కర్లపై పనిభారం పెంచడంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఐసీడీఎస్ అధికారులు వర్కర్లపై ఇష్టానుసారంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సెపక్‌తక్రా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాలలో జరుగుతున్న జాతీయ సెపక్‌తక్రా జాతీయ స్థాయి పోటీలు నాల్గవ రోజుకు చేరుకున్నాయి. శనివారం జరిగిన క్రీడలకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పోర్టో గౌరవాధ్యక్షులు, వైఎస్సార్ కడప జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ ఒంటేరు శ్రీనివాసరెడ్డి, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ షేక్షావలిరెడ్డి పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం జీఎల్ ప్రమోషన్ల గురించి చర్చించాలని సెపక్‌తక్రా సెక్రటరీ శ్రీనివాసులు, దండె నాగేంద్ర, ఏపీరెడ్డి తదితరులు వినతి పత్రం అందజేశారు.

ఆర్థిక సాయం

మహానంది: మసీదుపురం గ్రామానికి చెందిన బాలన్న అనారోగ్యంతో మృతి చెందడంతో అతని కుటుంబానికి సర్పంచ్ కాకనూరు లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ మునగాల మల్లికార్జునరెడ్డి శనివారం రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కాకనూరు మోహన్‌రెడ్డి, రామక్క, ఎస్సీ కాలనీ నేత నాగార్జున, తదితరులు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

సేంద్రియ ఎరువులతో నాణ్యమైన దిగుబడులు

పాములపాడు: నాణ్యమైన పంట దిగుబడులు సాధించాలంటే సేంద్రియ ఎరువులను వాడాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిని హేమలత సూచించారు. శనివారం మద్దూరు, పెంచికలపల్లి గ్రామాల్లో రబీలో సాగు చేసిన పైర్లను పరిశీలించారు. వరి కాండం తొలిచే పురుగును గమనించారు. నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎకరానికి 8 కేజీల చొప్పున వాడాలని రైతులకు సూచించారు.

4న శ్రీశైలంలో సూర్యారాధన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 4న రథసప్తమి (మాఘ శుద్ధ సప్తమి) పర్వదినాన్ని పురస్కరించుకుని అక్కమహాదేవి అలంకార మండపంలో సూర్యారాధన జరిపించనున్నట్లు కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగానే సూర్యయంత్రపూజ, చతుర్వేద పారాయణలు, అరుణపారాయణ జరిపించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు సూర్యభగవానుడికి ఉత్తర పూజనము (షోడశోపచారపూజ), నివేదన, మంత్రపుష్పము జరిపించనున్నాట్లు చెప్పారు.

చెక్కు పంపిణీ

జూపాడుబంగ్లా: బోధకాల వ్యాధితో దీర్ఘకాలికంగా బాధపడుతున్న మండల కేంద్రానికి చెందిన నక్క శేఖర్‌కు చికిత్సల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.40 వేల చెక్కును శనివారం ఎమ్మెల్యే జయసూర్య అందజేశారు. కార్యక్రమలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ, డీటీ నాగన్న పాల్గొన్నారు.

ముష్టపల్లిలో వైద్యసేవలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముష్టపల్లి గ్రామంలో శనివారం 104 సిబ్బంది వైద్య సేవలు అందించారు. వైద్యాధికారి పవన్‌కుమార్ ప్రజలకు కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఖైనీ, గుట్కా వంటి పొగాకు సంబంధిత పదార్థాలు తినడం వల్ల నోటి కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. మహిళల్లో రొమ్ము కేన్సర్, గర్భకోశ కేన్సర్ వచ్చే అవకాశముందన్నారు. ఆరోగ్య కార్యకర్త ద్వారా సంబంధిత వైద్యాధికారి వద్దకు వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకుని మందులు వాడాలన్నారు. కుష్టువ్యాధిగ్రస్తుల సర్వే కార్యక్రమాన్ని పర్యవేక్షించి తగిన సూచనలు తెలియజేశారు. బైర్లూటి వైద్యాధికారి పవన్ కుమార్, సీహెచ్ఓ అహ్మద్, ఆరోగ్య కార్యకర్తలు ఇందిరా ప్రభావతి, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అనుకూలంగా పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ

నంద్యాల: ప్రభుత్వ ఆదేశాలననుసరించి విద్యార్థులకు అనుగుణంగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పాఠశాల పునర్ వ్యవస్థీకరణపై సమీక్ష నిర్వహించారు. డీఈఓ జనార్దన్ రెడ్డి, ఎంఈఓలు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఒక్క విద్యార్థీ నష్టపోకుండా విద్యార్థులకు అనుకూలంగా ప్రక్రియను చేపట్టాలన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

- ఆర్డీఓ నాగజ్యోతి



అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి

కొత్తపల్లి: కొలనుభారతి క్షేత్రంలో ఆదివారం జరిగే వసంత పంచమి వేడుకలకు విజయవంతం చేసేందుకు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి సూచించారు. శనివారం కొలనుభారతీ క్షేత్రంలో తహసీల్దార్ ఉమారాణి, దేవదాయ శాఖ జిల్లా ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ మోహన్ ఆధ్వర్యంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎవరికి కేటాయించిన పనులు వారు సక్రమంగా చేయాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రానుండటంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

వసంత పంచమి వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భద్రతతో పాటు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామని ఆత్మకూరు సీఐ సరేష్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ కేశవతో కలిసి శనివారం కొలనుభారతి క్షేత్రంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. వేడుకల్లో ఎటువంటి సమస్య తలెత్తకుండా పటిష్ట భద్రత చేపడతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఆలయ ఈఓ రామలింగారెడ్డి, సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, ఆలయ చైర్మన్ వెంకటనాయుడు పాల్గొన్నారు.

5న ఫీజు పోరును విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్, నాయకులు

నందికొట్కూరు: ఈనెల 5న జరిగే ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంగం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ కోరారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఫీజు పోరు వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. దార సుధీర్ మాట్లాడుతూ పేద విద్యార్థుల ఫీజు బకాయిలను కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద విద్యార్థులపై కక్ష కట్టిందన్నారు. విద్యా దీవెనకు రూ.2,800 కోట్లు, వసతి దీవెన రూ.1,100 కోట్ల చొప్పున విద్యా సంస్థలకు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం అవలంభిస్తున్న తీరుతో పేద విద్యార్థులకు ఫీజు కష్టాలు తప్పడం లేదన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం చేతులు ఎత్తేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలు చెల్లించకపోతే ఈనెల 5న ఫీజు పోరు కార్యక్రమం పెద్ద ఎత్తున్న చేపడతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జగదీశ్వరరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు సురేష్ యాదవ్, విద్యార్థి విభాగం నియోజకవర్గం అధ్యక్షులు అబ్దుల్లా, నాయకులు రమేష్‌నాయుడు, నాగార్జునరెడ్డి, తిరుమలేష్‌రెడ్డి, రమణ, ఉపేంద్రారెడ్డి, అశోక్‌రెడ్డి, రాజు, లడ్డు, లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

- అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా



ఓవరాల్ ఛాంపియన్ షిప్ నిలిచిన విద్యార్థులు

మహానంది: క్రీడల్లో గెలుపోటములు సహజమని అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా తెలిపారు. మహానంది వ్యవసాయ కళాశాల వద్ద నాలుగు రోజులుగా జరిగిన స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల పోటీలు మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయన్నారు. నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ జాన్సన్ మాట్లాడుతూ యువతలో సామరస్యం, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆంగ్రో డైరెక్టర్ ఆఫ్ డిప్లమా కళాశాలలు డాక్టర్ ఎన్‌సీ వెంకటేశ్వర్లు, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీర జయలక్ష్మి, ఆఫీసర్ ఇన్‌చార్జ్ ఆఫ్ స్టూడెంట్ ఆక్టివిటీస్ డాక్టర్ ఎల్.విజయభాస్కర్, ఫిజికల్ డైరెక్టర్ రవికాంత్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్ షిప్ మార్టూరు

నాలుగు రోజులుగా జరిగిన క్రీడా పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లా మార్టూరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల జట్టు ఓవరాల్ ఛాంపియన్ షిప్‌గా నిలిచింది. సాంస్కృతిక విభాగంలో మడకశిర ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచినట్లు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీర జయలక్ష్మి తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణమాడ వీధిలోని నిత్యకళావేదికపై నెల్లూరుకు చెందిన బాలాత్రిపురసుందరి కూచిపూడి నృత్యాలయం వారి సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. వినాయకౌత్వం, ఓం నమశివాయ, శివతాండవం, బిల్వాష్టకం, కాలభైరవాష్టకం, అయిగిరినందిని తదితర అష్టకాలకు, గీతాలకు రుచిత, పావని, కీర్తిప్రియ, లాలిత్య, దేవహర్షిణి, భూమిశ్రీ, చాతుర్య, గీతిక, లక్ష్మీజస్విత తదితరులు నృత్యాలు ప్రదర్శించారు.